ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలి

కేటీఆర్‌ను కలిసిన చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

కేటీఆర్‌కు పూలమొక్క అందజేస్తున్న చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జనవరి 8 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను పార్టీ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, సామాన్యులకు అండగా ఉండాలని కేటీఆర్ తమకు సూచించినట్లు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయలని, కాంగ్రెస్ అరాచక పాలనను ప్రజలు కోరుకోవడం లేదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన సంక్షేమాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, పార్టీకి అండగా ఉన్నవారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. చిర్ర సుమన్, రవీందర్ ఉన్నారు.

సీఎం దృష్టికి సమస్యలు తీసుకుపోండి..

కేయూ వీసీకి కాంట్రాక్టు అధ్యాపకుల వినతి

హనుమకొండ చౌరస్తా, జనవరి 8 : వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సీఎం ప్రత్యేక సమావేశంలో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను ప్రస్తావించాలని కోరుతూ కేయూ వీసీ ప్రతాపరెడ్డిని బుధవారం కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు పరిపాలనా భవనంలోని కమిటీ హాల్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వీసీ, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అనేక సమస్యలపై కాంట్రాక్టు అధ్యాపకులతో చర్చించారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ, యూజీసీ పే స్కేల్స్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ కంటే ముందుగానే తమ సమస్యలు పరిష్కరించాలని వీసీకి విన్నవించారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి స్కేల్ వర్తింపజేసేలా ప్రయత్నిస్తానని వీసీ హామీ ఇచ్చారు. కేయూ పాలకమండలి సభ్యులు చిర్ర రాజు, కేయూ కో ఆర్డినేషన్ కమిటీ బాధ్యులు సతీశ్, నరసింహారావు, శ్రీధర్‌కుమార్ లోథ్, మాదాసి కనకయ్య, జూల సత్య, సాదు రాజేశ్, నాగయ్య, తూర్పాటి వెంకటేశ్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, సంగీత్, మామిడి లింగయ్య, సదాశివ్, రఘువర్ధన్‌రెడ్డి, రమేశ్, శ్రీధర్‌రావు, ఉషాకిరణ్, రాధిక, సుకన్య, సునీత, రమాదేవి, సాహితీ ఉన్నారు.

కేయూలో పాఠ్య ప్రణాళికా అధ్యక్షుల నియామకం

హనుమకొండ చౌరస్తా, జనవరి 8 : కాకతీయ విశ్వవిద్యాలయ బోటనీ విభాగ పాఠ్య ప్రణాళికా అధ్యక్షుడిగా ఒప్పంద అధ్యాపకుడు కరుణాకర్‌రావును నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాకర్‌రావు గతంలో ఆర్ట్స్ కాలేజీ బోటనీ విభాగ ఇన్‌చార్జిగా, దూరవిద్యా కేంద్రం సైన్స్ విభాగాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ఎంఎస్‌సీ కోర్స్ కో ఆర్డినేటర్‌గా కూడా పనిచేశారు. 40 పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించారు. ఈ పదవిలో తిరిగి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగనున్నారు. అలాగే కేయూ ఈసీఈ అండ్ ఈఅండ్ఐ విభాగ పాఠ్య ప్రణాళికా అధ్యక్షుడిగా మహేందర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ విభాగ పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా విభాగ ఒప్పంద అధ్యాపకుడు ఆకుతోట శ్రీనివాసులును నియమించారు. ప్రస్తుతం శ్రీనివాసులు బీసీ సెల్ సంచాలకులుగా పని చేస్తున్నారు. 120కి పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్రాలు సమర్పించారు. ఈ పదవిలో తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతారు. ఎనిమిదికి పైగా తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ పుస్తకాలకు సంపాదకీయం వహించారు.

పల్లె ప్రకృతి వనంలో ఎండుతున్న మొక్కలు

కామారెడ్డిపల్లి పల్లె ప్రకృతి వనంలో మోడుబారిన మొక్కలు

పరకాల, జనవరి 8 : గ్రామాల్లో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్లక్ష్యం నీడలో ఉన్నాయి. వనాలను పట్టించుకునే వారు కరువవడంతో మొక్కలు ఎండుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పల్లెల్లో పాలన అటకెక్కడంతో పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణ గాలికొదిలారు. ఒక పక్క సర్పంచ్‌లు లేకపోవడం, ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పాలన పట్టించుకోపోవడం మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలపై చిన్నచూపు చూస్తుండడంతో నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీ అధికారులపై నిర్వహణ భారమవ్వడంతో పల్లె ప్రకృతి వనాలు కళాహీనమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై పలువురు ప్రకృతి ప్రేమికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరగాలి

- సీ సెక్షన్లు తగ్గించాలి
- మార్చి నెలాఖరు వరకు నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలి
- కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జనవరి 8 : జిల్లాలోని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ దవాఖానల్లో జరిగే ప్రసవాలు ఈ నెలలో కనీసం రెండు శాతం ఎక్కువయ్యేలా చూడాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి వరకు 100 శాతం లక్ష్యం సాధించాలన్నారు. ముఖ్యంగా ప్రతి పీహెచ్‌సీలో నెలకు ఒక సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని, 24/7 ఆరోగ్య కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. సీ సెక్షన్లు తగ్గించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల రిస్క్రీనింగ్ మార్చి వరకు పూర్తి చేయాలని, అలాగే వారికి ఫాలో అప్ సేవలు అందించాలన్నారు. టీబీ కేసులను గుర్తించేందుకు పరీక్షలు ఎక్కువగా నిర్వహించాలని, సరైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ-ఔషధి పోర్టల్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ మందుల కొరత లేకుండా చూడాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది తమ పరిధిలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను రెగ్యులర్‌గా సందర్శించాలన్నారు. పీహెచ్‌సీలోని సమస్యలపై వైద్యాధికారులను అడిగి తెలుకొన్నారు. చిన్న చిన్న అవసరమైన రిపేర్లు, ప్లంబింగ్, ఎలక్ట్రిసిటీ లాంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, డీఎంహెచ్‌వోకు నివేదిక సమర్పించాలని, దానికి అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు, ఎంటీపీ చట్టానికి వ్యతిరేకంగా అబార్షన్లు నిర్వహించే వారిపై ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేస్తామన్నారు. pndtmtpcomplaints dmhohnk@gmail.com అలాగే 104, 181, 1098, 100 టోల్ ఫ్రీ నంబర్లలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమార్, పీవోడీటీటీ లలితాదేవి, డీటీసీవో హిమబిందు, ప్రోగ్రాం అధికారులు ఇత్యధార, అహ్మద్, నాగరాజు, డెమో అశోక్‌రెడ్డి, గణాంక అధికారి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి..

ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కలెక్టర్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ బాలిక ఉన్నత లష్కర్ బజార్ పాఠశాలను తనిఖీ చేశారు. కిచెన్ షెడ్, తాగునీరు, టాయిలెట్స్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతోందా? అని ప్రధానోపాధ్యాయురాలు ఉమను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. కంప్యూటర్ ల్యాబ్, క్లాస్ రూంలను పరిశీలించి సిలబస్ ప్రకారం పాఠాలను పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటరమణతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. డీఈవో వాసంతి, ఎంఈవో నెహ్రూ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటుపై మంత్రులు సీతక్క, కొండ సురేఖతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన 150 ఎకరాల్లో ఇప్పటివరకు 75 ఎకరాలు గుర్తించి తనిఖీ చేశామని, ఎస్‌హెచ్‌జీలను సైతం గుర్తించామని, మిగిలిన 75 ఎకరాలు ఈ నెల 22వ తేదీలోగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీను పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

కాజీపేట, జనవరి 8 : అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ ఎస్ఎఫ్‌వో దయాకర్ సూచించారు. కాజీపేట పట్టణం బాపూజీనగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో బుధవారం రాష్ట్ర విపత్తు, అగ్ని మాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఇంట్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాజు, అగ్నిమాపక సిబ్బంది జనార్దన్, యాకూబ్, రత్నాకర్, గౌతం, మునీ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

న్యూశాయంపేట, జనవరి 8 : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ అన్నారు. హంటర్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 1930లో సమాచారం తెలపాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ రవి, సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి ఎస్సై నియామకం ఎప్పుడో?

ఎస్‌హెచ్‌వో పోస్ట్ ఖాళీతో కేసుల విచారణలో జాప్యం

సుబేదారి, జనవరి 8 : ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ అవినీతికి పాల్పడడంతో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా డిసెంబర్‌లో సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో అక్కడ 20 రోజుల నుంచి ఎస్సై పోస్ట్ ఖాళీగా ఉంది. కొత్త ఎస్సైని నియమించకపోవడంతో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్కతుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో 19 గ్రామ పంచాయితీలు ఉండగా, రోజు 5నుంచి 10 పిటిషన్లు వస్తుంటాయి. ఎస్సై స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) కావడంతో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై కేసుల నమోదు, విచారణ పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పులి రమేశ్ ప్రస్తుతం ఎల్కతుర్తి స్టేషన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. రెగ్యులర్ ఎస్సై పోస్ట్ ఖాళీగా ఉండడంతో ఫిర్యాదులు చేసిన బాధితులు న్యాయం కోసం స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. సీపీ వెంటనే ఎస్సైని నియమించాలని వారు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా యూత్ అధ్యక్షుడిగా శివ

శాయంపేట, జనవరి 8 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా యూత్ అధ్యక్షుడిగా మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన కొమ్ముల శివ ఎన్నికయ్యారు. ఈ మేరకు టీయూఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ పొడిశెట్టి గణేశ్ ప్రకటించారు. టీయూఎఫ్ చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నందగిరి రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబారావుకు శివ కృతజ్ఞతలు తెలిపారు.

జాతరలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

డీపీవో లక్ష్మీరమాకాంత్

భీమదేవరపల్లి, జనవరి 8 : కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో లక్ష్మీరమాకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తకొండలో పంచాయతీ సెక్రటరీలతో కలిసి పారిశుధ్య నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలో చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. ఈ నెల 13,14,15వ తేదీల్లో జాతరకు భక్తులు పోటెత్తుతారని తెలిపారు. చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. దుమ్ము, ధూళి రాకుండా ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించాలన్నారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు మండలాల పంచాయతీ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది జాతరలో విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్‌కు శ్రీహర్షిత

శ్రీహర్షితకు బొకే అందజేస్తున్న కళాశాల బృందం

నయీంనగర్, జనవరి 8 : కర్నూల్ జిల్లాలో ఈ నెల 10న నిర్వహించే ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్‌కు నక్కలగుట్టలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలకు చెందిన కుసుమ శ్రీహర్షిత ఎంపికైనట్లు కళాశాల బాధ్యులు తెలిపారు. ఈ పోటీల్లో 5దేశాలు, 25రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు పాల్గొంటారని, తెలంగాణ రాష్ట్రం నుంచి శ్రీహర్షిత ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీహర్షితను కళాశాల బాధ్యులు వెంకటేశ్వరరావు, రవి కిశోర్, రామకృష్ణప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

మడికొండ, జనవరి 8 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన భార్యాభర్తలపై మడికొండ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. మడికొండ ప్రధాన రహదారిపై మెట్టుగుట్ట ద్వారం వద్ద ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో నంబరు ప్లేట్ లేకుండా వస్తున్న స్కూటీని ఆపి వివరాలను సేకరిస్తున్న సమయంలో భార్యాభర్తలు దారంగుల కల్పన, రవి పోలీసులపై దుర్భాషలాడగా, కేసు నమోదు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నడికూడ, జనవరి 8 : మండలంలోని ముస్త్యాలపల్లి, రాయపర్తి గ్రామాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎంపి కడియం కావ్య బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర దేవెందర్, కార్యదర్శి మలహల్‌రావు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ ఎంపిక పోటీలు

హసన్‌పర్తి, జనవరి 8 : హసన్‌పర్తి జడ్పీ హైస్కూల్‌లో గురువారం కబడ్డీ ఎంపిక పోటీలు ప్రారంభం కానున్నట్లు కబడ్డీ అసోసియేషన్ హసన్‌పర్తి జోనల్ చైర్మన్ అటికం రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హసన్‌పర్తి, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన బాల బాలికలు మధ్యాహ్నం 3గంటలకు హాజరు కావాలన్నారు. 16 సంవత్సరాల్లోపు ఉండి 55 కేజీల బరువు ఉన్న క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు.

గౌడ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రఘువంశీ

ఐనవోలు, జనవరి 8 : తెలంగాణ గౌడ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐనవోలుకు చెందిన గడ్డం రఘువంశీగౌడ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గోపీగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రఘువంశీ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన గోపీగౌడ్, పల్లె లక్ష్మణ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ/ఐనవోలు, జనవరి 8 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో కేయూసీ సబ్ స్టేషన్ కిషన్‌పుర 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం10 నుంచి 12గంటల వరకు కిషన్‌పురా, లష్కర్‌బజార్, కొండపర్తి, భట్టుపల్లి 11కేవీ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి 11 గంటల వరకు భట్టుపల్లి, కొత్తపల్లి, ఇందిరమ్మ కాలనీ దర్గా, సైనిక్‌పురి, అమ్మవారిపేట, బాలసముద్రం సబ్ స్టేషన్ మచిలీబజార్ 11 కేవీ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 12గంటల వరకు పద్మాక్షికాలనీ, శివముక్తిధామ్, రాజ్‌పుత్‌వాడ, జయ కళాశాల ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. అలాగే ఐనవోలు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, నాగపురం గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద (మల్లికార్జునస్వామి దేవాలయం) ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రిలీజ్

ఎస్ఈ వెంకటరమణ

హనుమకొండ, జనవరి 8 : వ్యవసాయ సర్వీసుల మంజూరు త్వరితగతిన చేస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. జనవరి -2024 నుంచి డిసెంబర్ వరకు 1,390 సర్వీసులను మంజూరు చేశామన్నారు. ఒక డిసెంబర్‌లోనే సుమారు 188 సర్వీసుల మంజూరు చేశామన్నారు. 2023తో పోల్చుకుంటే దాదాపు 20 శాతం పెరిగిందన్నారు.

హరివిల్లును తలపించేలా రంగవల్లులు

ముగ్గులను తిలకిస్తున్న న్యాయమూర్తులు

వరంగల్ లీగల్, జనవరి 8 : న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు వేసిన ముగ్గులు హరివిల్లును తలపిస్తున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ ప్రశంసించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ విజేతలకు న్యాయమూర్తి బహుమతులు అందజేశారు. న్యాయవాదుల ముగ్గుల పోటీల్లో లావణ్య, రజిత, శశిరేఖ, సింధూజ, సుకన్య జయశ్రీ, న్యాయశాఖ పోటీల్లో నాగ సుధ, అరుణ, లావణ్య, సోనియా, రవళి, గౌతమి గెలుపొందారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జీవన్ గౌడ్, కార్యదర్శి ముదస్సిర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

భీమదేవరపల్లి, జనవరి 8 : మండలంలోని ముస్తాఫాపూర్ గ్రామంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని డబ్ల్యూజేఐ యూనియన్ మండలాధ్యక్షుడు కొండ్రాజ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మెడికవర్ హాస్పిటల్, రెడ్ క్రాస్ సొసైటీ, శరత్ లేజర్ ఆస్పత్రి, డబ్ల్యూజేఐ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, కొలస్ట్రాల్, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే

దామెర, జనవరి 8 : మండలంలోని ఊరుగొండలో బుధవారం సర్వోదయ యాత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళలపై అనేక రకాలుగా ఆంక్షలు విధిస్తూ వివక్షకు గురి చేస్తున్నారని తెలిపారు. హింసలేని సమాజ నిర్మాణంలో మహిళలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సర్వోదయ సంస్థ కార్యదర్శి పల్లె పాడు దామోదర్, సఖీ వన్‌స్టాప్ కేంద్రం అడ్మిన్ హైమావతి, సంస్థ మేనేజర్ కవి రాజ్, ఇందిర, రవీందర్, సీసీ మాధవి, కేస్‌వర్కర్ భారతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి క్షమాదేశ్ పాండే

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

jobs Apply Now!

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిని తొలగించాలి

హనుమకొండ చౌరస్తా, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పెరటి మల్లారెడ్డిని పదవి నుంచి తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుగ్గెల తిరుపతి, నాయకులు చింత ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీసీ ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. క్యాంపస్‌లో దళిత విద్యార్థులు, ఉద్యోగులపై అమానుషంగా ప్రవర్తించడం, పరోక్షంగా కులవివక్షతను పాటించడం, అవమానకరంగా మాట్లాడుతున్నాడని, గతంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించకుండానే, సీనియర్ ప్రొఫెసర్‌గా చలామణి అవుతున్నాడని, ఆయన డిపార్ట్‌మెంట్‌లో విద్యార్థులకు కనీసం తరగతుల చెప్పకపోవడం, రిక్రూట్‌మెంట్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు పరిపాలనకు సంబంధించిన పదవుల్లోనే కొనసాగుతూ విద్యాబోధన పూర్తిగా మర్చిపోయారన్నారు. గతంలో ఎగ్జామినేషన్ బ్రాంచ్ కంట్రోలర్‌గా, సైన్స్ డీన్‌గా బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాడని, అనేక అక్రమాలకు అవకాశం ఇచ్చాడని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ వ్యవహారంపై గతంలో ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, పరిపాలనకు సంబంధించిన పదవుల్లో ఆయనకు అవకాశం ఇవ్వొద్దని వినతిపత్రంలో కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఆత్మకూరు, జనవరి 8 : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా ఆత్మకూరు పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నుంచి ఎన్ఎస్ఆర్ హోటల్ వరకు డీసీపీ రవీందర్, సీఐ సంతోశ్‌తో పాటు 200 మంది బైక్ ర్యాలీ తీశార